సాక్షి ఆదిలాబాద్

గురువారం | 19 | జూన్ | 2025



కేజీబీవీల్లో నూతన మెనూ

కేజీబీవీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మెనూలో మార్పులు చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేయనుంది. 8లో▸



ఏళ్లుగా నిరీక్షణ!

కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఏళ్లుగా ప్రోత్సాహకాలు అందడం లేదు. దళితాభివృద్ధి శాఖలో 87 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జొన్న రైతులకు రూ.20 కోట్లు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మార్క్‌ఫెడ్‌కు విక్రయించిన జొన్న రైతులకు సంబంధించి రూ.20 కోట్ల నిధులు విడుదలైనట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈఏడాది ఏప్రిల్ 28 వరకు విక్రయించిన రైతుల ఖాతాలకు ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా రైతులకు విడతల వారీగా నిధులు విడుదల అవుతాయని తెలిపారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

తలమడుగు: రైతులకు ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని సుంకిడి, తలమడగు గ్రామాల్లోని పలు విత్తన దుకాణాలు, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న ఎరువుల షాపులను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో ప్రమోద్‌రెడ్డి, ఏఈవోలు రమేశ్, సతీశ్, సిబ్బంది తదితరులున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్)ఉచితశిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జూలై 8వరకు ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే నెల 12న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్టు ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులు జూలై 25 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టైలరింగ్‌లో శిక్షణ కోసం..

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్,నాబార్డ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ప్రకటనలో తెలిపారు. ఈనెల 26లోగా జిల్లా కేంద్రంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు అర్హులని తెలిపారు. వివరాలకు 9393214465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ పరిరక్షణ, పాఠశాలల అభ్యున్నతి కోసం టీఎస్ యూటీఎఫ్ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతలో ఇది స్పష్టమైందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, సంఘ బాధ్యులు శ్రీనివాస్, స్వామి, ఇస్తారి, గౌస్ మోయినొద్దీన్, గణేశ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం



సంఘ బాధ్యులను సన్మానిస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో పక్షాన పోరాడుతామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వసతిగృహ, సంక్షేమ అధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. నూతనంగా నియామకమైన వసతిగృహ సంక్షేమ అధికారుల నుంచి స భ్యత్వం తీసుకున్నారు. ఇందులో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, సెంట్రల్ ఫోరం బాధ్యులు తిరమల్‌రెడ్డి, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు నర్సింలు, సుజాత, ఓంప్రసాద్, పర్వేజ్, చిన్నయ్య, జావిద్, రవి, సంధ్య పాల్గొన్నారు.

నేడు 'చేయూత'పై శిక్షణ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రత (చేయూత) పింఛన్ల అమలుపై గురువారం జిల్లా స్థాయి అధికారులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు శిక్షణ నిర్వహించనున్నట్లు డీఆర్డీవో రాథోడ్ రవీందర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బ్లాక్‌లో యూరియా!

భీంపూర్ మండలం అందర్‌బంద్ గ్రామంలో యూరియా లోడ్‌తో వెళ్తున్న ఓ లారీని టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం పట్టుకుంది. అందులో 220 బస్తాలు ఉన్నాయి. వెంటనే దానిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాధారణంగా రిటేల్‌కు వచ్చిన తర్వాతనే రైతులకు పంపిణీ చేయాలి. అయితే ఇక్కడ హోల్‌సెల్ గోదాం నుంచి ఆ యూరియా బస్తాలు ఆ మండలానికి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ నుంచి ఓ డీలర్‌కు షోకాజు నోటీసు కూడా జారీ అయింది. ఘటనపై విచారణ సాగుతుంది.





ఇది భీంపూర్ మండలానికి సమీపంలోనే ఉండే తాంసిలోని పీఏసీఎస్ భవనం. ఇప్పుడు ఈ భవనం గురించి ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. నాలుగైదు రోజులుగా రైతులు యూరియా కోసం ఇక్కడికి వస్తున్నారు. అయితే స్టాక్ లేదని చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఆరు రోజుల క్రితం రూ.లక్ష 12వేల విలువైన 20 టన్నుల యూరియాను సమకూర్చాలని ఈ పీఏసీఎస్ సీఈవో అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆ లోడ్ రాకపోవడంతో రైతులకు యూరియా ఇవ్వని పరిస్థితి. జిల్లాలోని అనేక పీఏసీఎస్‌ల్లోనూ ఇదే పరిస్థితి ఉందనే విమర్శలున్నాయి.

- దొడ్డిదారిన బడాబాబుల చెంతకు..
- హోల్‌సెల్ గోదాం నుంచి నేరుగా వారి వద్దకే..
- మరోవైపు క్షేత్రస్థాయిలో నో స్టాక్
- నిల్వలు ఉన్నాయంటున్న వ్యవసాయ శాఖ
- అయోమయంలో రైతులు

జిల్లాలో వానాకాలం సాగుకు యూరియా ఆవశ్యకత వివరాలు
యూరియా : 35వేల మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు వచ్చింది : 20వేల మెట్రిక్ టన్నులు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో వానాకాలం సాగు మొదలైంది. తొలకరి వర్షాలతో రైతులు పత్తి, సోయా, కంది విత్తనాలు నాటారు. మొలకలు వచ్చిన తర్వాత పంట ఎదుగుదలకు డీఏపీ, యూరియా చల్లాల్సి ఉంటుంది. యూరియా పంటకు ఇచ్చేందుకు మరికొంత సమయం అవసరం. అయితే రైతులు ముందు జాగ్రత్తగా దాన్ని తీసుకొని నిల్వ చేసుకుంటారు. కొంత మంది మొలకలు రాగానే వేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో రైతులు దాని కోసం సొసైటీలు, అగ్రో సెంటర్ల బాట పడుతున్నారు. అక్కడ స్టాక్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్‌లో కొనుగోలు కోసం మార్కెట్‌కు వెళ్తున్నారు. అక్కడ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ప్రచారం సాగుతుంది. యూరియాను 60 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా.. అంటే పీఏసీఎస్‌లు, అగ్రో సెంటర్లు, ఇతరత్రా వాటి ద్వారా విక్రయిస్తారు. మిగతా 40 శాతం ప్రైవేట్ వ్యాపారుల ద్వారా విక్రయిస్తుంటారు. అయితే పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో లేకపోవడం, మరోపక్క లారీల్లో నేరుగా కొంతమంది బడా బాబులకు గోదాముల నుంచి చేరుతున్న పరిణామాలు జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిందనేదానికి నిదర్శనంగా నిలుస్తోంది.

క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు..

అధికారులు చెబుతున్నదానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా స్టాక్ ఉందని, అన్ని సొసైటీలు, అగ్రోసెంటర్లు, డీసీఎంఎస్‌ల వద్ద లభిస్తున్నాయని చెబుతున్నారు. అయితే వారు చెబుతున్న దానికి, వాస్తవ పరిస్థితికి పొంతన కుదరడం లేదు. బుధవారం 'సాక్షి' తాంసి పీఏసీఎస్‌లో యూరియా లభ్యతపై పరిశీలన చేయగా.. ఆ సీఈవో వారం క్రితం స్టాక్ కోసం డబ్బులు కట్టామని, ఇప్పటివరకు రాలేదని పేర్కొన్నారు. నాలుగు రోజులుగా తమ వద్ద స్టాకే లేదని స్పష్టం చేయడం గమనార్హం. ఇక జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ ట్రేడర్స్ వద్దకు రైతులు యూరియా కోసం వెళ్తే.. వారు యూరియాతో పాటు కార్బన్ అనే ధాతువు కొన్ని బ్యాగులను అంటగడుతున్నారనే ప్రచారం ఉంది. ఈ కార్బన్ వినియోగం విషయంలో రైతులకు ఆసక్తి లేకపోయినా యూరియా కోసం తప్పని పరిస్థితిలో కొనాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

విచారణ చేస్తున్నాం..



భీంపూర్ మండలం అందర్‌బంద్‌లో యూరియా లోడ్‌తో పట్టుబడిన లారీ విషయంలో విచారణ చేస్తున్నాం. దీనికి సంబంధించి రైతుమిత్ర అనే డీలర్‌కు షోకాజు నోటీసులు ఇచ్చాం. దీనిపై వ్యవసాయశాఖ ఏడీ, ఏవోలతో విచారణ చేయిస్తున్నాం. 18 మంది రైతులు ఈ యూరియాను తెప్పించుకున్నట్లుగా చెబుతున్నారు. ఈ విషయంలో అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం.

– శ్రీధర్‌స్వామి,
జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

కొలిక్కి వచ్చేనా..!?

- ఔట్‌సోర్సింగ్ ఎంప్యానల్‌మెంట్ టెండర్లలో తీవ్ర జాప్యం
- ఓపెన్ చేసి నెల దాటినా పూర్తికాని పరిశీలన
- గుర్తింపు కోసం డిఫాల్ట్ ఏజెన్సీల పైరవీలు
- అక్రమాలపై సర్వత్రా విమర్శలు



జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయం

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో అత్యధిక ఔట్‌సోర్సింగ్ పోస్టులు నిర్వహిస్తున్న ఓ ఏజెన్సీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా ఎంప్యానల్‌మెంట్‌లో గుర్తింపు కలిగి ఉంది. పక్క జిల్లా కుమురంభీంలోనే ఆ ఏజెన్సీ వందలాది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించలేదు. ప్రస్తుతం జిల్లాలో కొత్త ఎంప్యానల్‌మెంట్ కోసం టెండర్లలో తిరిగి ఆ ఏజెన్సీ కూడా దరఖాస్తు చేసుకుంది. అయితే రాష్ట్రంలో ఎక్కడైనా ఉద్యోగులకు సంబంధించి ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించనటువంటి ఇలాంటి ఏజెన్సీలను డిఫాల్ట్‌గా పరిగణించాలి. ఆన్‌లైన్‌లో దీన్ని పరిశీలించి ప్రక్రియ చేపట్టాలి. అయితే ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ఎంప్యానల్‌మెంట్ గుర్తింపులో ఆ ఏజెన్సీఅడ్డదారులు తొక్కుతుందనే ప్రచారం సాగుతుంది. పరిశీలనప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏజెన్సీ డిఫాల్ట్‌లో ఉన్నప్పటికి దాన్ని ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పుకుంటున్నారు.

కొనసా..గుతున్న పరిశీలన

కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా టెండర్లు తెరిచి నెల దాటినా పరిశీలన ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండగా, దీన్ని డిఫాల్ట్ ఏజెన్సీలు తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు తెలుస్తోంది. నేతలు, ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చి ఎంప్యానల్‌మెంట్‌లో చోటు కోసం అడ్డదారులు తొక్కుతున్నారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో అన్ని సజావుగా ఉన్న ఏజెన్సీలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నాయి. తమకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

నెల రోజులకు పైబడి ..

జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల గుర్తింపునకు సంబంధించి కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటుకు గత నెలలో జిల్లా యంత్రాంగం టెండర్లు పిలిచింది. మే 2 నుంచి 13వరకు జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో ఏజెన్సీల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 29 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నాయి. అదే నెల 14న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి, కార్మికశాఖ, ట్రెజరీ అధికారుల సమక్షంలో ఈ టెండర్లను తెరిచారు. అప్పటి నుంచి పరిశీలన ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా ముగించాల్సి ఉండగా జాప్యం అవుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో పక్క అవకాశం లేదని తెలుసుకుంటున్న ఏజెన్సీలు పైరవీలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

త్వరలోనే పూర్తి చేస్తాం

త్వరలోనే ప్రక్రియ పూర్తి చేస్తాం. ఎంప్యానల్‌మెంట్‌లో ఏజెన్సీల గుర్తింపునకు సంబంధించి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నాం. జాబితా విడుదల చేసిన తర్వాత ఎవరైనా ఏదైనా ఏజెన్సీ గురించి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేస్తే దానికనుగుణంగా కూడా చర్యలు తీసుకుంటాం.

–కె.మిల్కా, జిల్లా ఉపాధి కల్పనాధికారి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- డీఈవో శ్రీనివాసరెడ్డి
- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. 'చదువు కొనాల్సిందే' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం వంటివి విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఇందులో ఆదిలాబాద్ అర్బన్ మండల విద్యాధికారి డి.సోమయ్య, సెక్టోరియల్ అధికారులు రఘురమణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు 'అభయ'

- 'మై టాక్సీ ఈస్ సేఫ్' ప్రారంభం
- 3,232 ఆటోలకు క్యూఆర్ కోడ్
- వినూత్న కార్యక్రమానికి ఎస్పీ శ్రీకారం



ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పక్కన ఏఎస్పీ కాజల్‌సింగ్

ఆదిలాబాద్: ప్రయాణికుల భద్రతే పరమావధిగా 'అభయ – మై టాక్సీ ఈస్ సేఫ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలనే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, యువతులు, మహిళలు నిర్భయంగా ఆటోల్లో ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న ప్రతీ ఆటో ముందు, వెనుక భాగంలో ప్రత్యేక క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందుతుందన్నారు. వెబ్ అప్లికేషన్ ద్వారా మొబైల్ నంబర్ ఎంటర్ చేసి ట్రాక్ మై లొకేషన్, ఎమర్జెన్సీ కాల్, కంప్లైంట్ వంటి సేవలను పొందవచ్చన్నారు. అంతేకాకుండా సురక్షితంగా ప్రయాణించే ఆటోలకు రేటింగ్ సైతం ఇచ్చే వెసులుబాటు ఉందన్నారు. ఉత్తమ రేటింగ్ కలిగిన డ్రైవర్లు, యజమానులకు అవార్డులు అందించి ప్రోత్సహిస్తామన్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆటో డ్రైవర్లు, యజమానులకు ఏడాది పాటు లక్ష ప్రమాద బీమా వర్తిస్తుందని వివరించారు. అనంతరం పలు ఆటోలకు క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్ అతికించారు. వేదికపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉట్నూరు ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రణయ్‌కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్లు సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావు, ఎస్సైలు ముజాహిద్, అశోక్, మహేందర్, దేవేందర్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్: క్రికెటర్లు క్రీడా నైపుణ్యాలను పెంచుకుంటే భవిష్యత్తులో గొప్పగా రాణించవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదిలాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ ఎంపిక పోటీలను బుధవారం ప్రారంభించారు. ఆరెంజ్ – ఎల్లో జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సాధన చేసి మంచి క్రికెటర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఆరెంజ్ జట్టుపై ఎల్లో జట్టు విజయం సాధించింది.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం..

బజార్‌హత్నూర్: బాధిత కుటుంబానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావు బుధవారం ఉదయం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. స్వగ్రామమైన జాతర్లలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఎస్పీ పాల్గొన్నారు. పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అనంతరం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, ఇచ్చోడ సీఐ బండారి రాజు, బజార్‌హత్నూర్ ఎస్సై సంజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ రాజర్షి షా



నాప్‌కిన్ యూనిట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకుని ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రూ.8లక్షల వ్యయంతో మున్సిపల్ కార్యాలయ పాత భవనంలో ఏర్పాటు చేసిన శానిటరీ నాప్‌కిన్ ప్యాడ్స్ మేకింగ్ యూనిట్, పట్టణంలోని గాంధీనగర్‌లో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీం ద్వారా రూ. 60లక్షల వ్యయంతో నెలకొల్పిన 22 రకాల మిల్లెట్ బిస్కెట్స్ తయారీ యూనిట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. పలువురు పాఠశాల విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ అందించాలని సూచించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్, మెప్మా డీఎంసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లోగా బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలి

కైలాస్‌నగర్: మూడు నెలల రేషన్ కోటా బియ్యం పంపిణీ గడువు ఈ నెల 30వరకు ఉన్నప్పటికీ జిల్లాలో మూడు రోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా డీలర్లను ఆదేశించారు. పీడీఎస్ బియ్యం సరఫరాపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్టేజి-1, స్టేజి-2, మండలస్థాయి గోదాం ఇన్‌చార్జీలు, డీలర్లు, హమాలీలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ గడువులోపు బియ్యం పంపిణీ చేయాలన్నారు. మండల స్థాయి గోదాముల నుంచి చౌకధరల దుకాణాలకు రావాల్సిన బియ్యన్ని త్వరగా సరఫరా చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం సకాలంలో సరఫరా చేయాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణి, డీఎస్‌వో వాజీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న శివచరణ్‌రెడ్డి

కైలాస్‌నగర్: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూత్‌కాంగ్రెస్ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మాజిద్ ఖాన్, ఎర్రమళ్ల రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి అల్మాస్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, నాయకులు శాంతన్‌రావు, అర్భాత్‌ఖాన్, నాహిద్, పోతారెడ్డి, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన టెట్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 100 మందికి గాను 82 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 100 మందికి గాను 79 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు తెలిపారు. ఈనెల 19, 22, 24, 27, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని అబ్జర్వర్లు ఉదయ్‌రావు, సంతోష్, ఫ్లయింగ్ స్క్వాడ్ సోమయ్య పరిశీలించారు.

చిత్తు కాదు.. పుస్తకాలండోయ్!

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వసతిగృహంలో కొనసాగుతున్న భీంపూర్ కేజీబీవీలోని ఓ గదిలో పాఠ్యపుస్తకాలు ఇలా చిందరవందరగా దర్శనమిస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో మిగిలిపోయిన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల నుంచి తిరిగి తీసుకున్న వాటిని ఇష్టారీతిన పడేశారు. పుస్తకాలు లేక చాలా మంది విద్యార్థులు ఓవైపు అవస్థలు పడుతుండగా, ఉన్న పుస్తకాలను క్రమపద్ధతిలో కాకుండా చెల్లాచెదురుగా పడేసి ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్కడికి వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ దృశ్యాన్ని చూసి విస్తుపోతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చిందరవందరగా పడేసిన పుస్తకాలు

క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి శివారులో బుధవారం ప్రాణహిత నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పెద్దింటి రాజు, మానిశెట్టి ప్రశాంత్ అనే వ్యక్తులను పట్టుకుని ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ప్రాణహిత నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి ఉన్నారు.

విద్యార్థినులను వేధించిన యువకుడిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ విద్యార్థినులను వేధించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమా బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు కాలేజీరోడ్డులోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేసే యువకుడు తన ప్రైవేటు భాగాలు చూపిస్తూ వేధిస్తున్నాడని అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గొలుసు చోరీకి విఫలయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఓ మహిళ గొలుసు దొంగతనానికి విఫలయత్నం చేసింది. పట్టణ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన సాయవ్వ పిల్లల స్కూల్ ఫీజు కట్టేందుకు నిర్మల్‌కు వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో బస్టాండ్ ప్రాంతంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగింది. ఆ సమయంలో గంగామణి అనే మహిళ సాయవ్వ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసేందుకు యత్నించింది. వెంటనే సాయవ్వ దొంగా అని అరవడంతో.. స్థానికులు గంగామణిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై యువకుల దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం స్కూల్ బస్సు డ్రైవర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ముల్కల్ల వైపు నుంచి మంచిర్యాలకు వస్తుండగా వెనుక నుంచి మద్యం మత్తులో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై వచ్చి ఓవర్ టేక్ చేసి స్థానిక ఐబీ చౌరస్తాలో బస్సుకు అడ్డంగా వాహనాలు నిలిపారు. బస్సు డ్రైవర్ శ్రీనును కిందకు దించి చితకబాదారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆపేందుకు ప్రయత్నించగా దురుసుగా ప్రవర్తించారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ శ్రీను ఫిర్యాదు మేరకు కాలేజిరోడ్‌కు చెందిన కరవేణి మనోజ్, మత్తునూరి వినయ్, మేకల వెంకటసాయి, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

రెబ్బెన: మండలంలో వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఇద్దరు వ్యక్తుల వద్ద నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని గంగాపూర్ చౌరస్తా, గోలేటి ఎక్స్‌రోడ్‌లలో పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మదాసు రాజు అనే వ్యక్తి వద్ద 2 కిలోలు, కొల్లూరి తిరుపతి అనే వ్యక్తి వద్ద 2 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. విత్తనాలను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుర్తింపు లేని కంపెనీలకు చెందిన విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ సుభాష్‌నగర్‌కు చెందిన కాలేగుర రియాన్(6) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. రోజువారీగా బుధవారం పాఠశాలకు ఆటోలో వెళ్లాడు. సాయంత్రం పాఠశాల అనంతరం ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో ఆటో సుభాష్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోకి రాగా ఆటో డ్రైవర్ నల్లాల రాజేశ్ ఆటోను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ఆటోలో ఉన్న రియాన్ రోడ్డుపై పడిపోయాడు. రియాన్ తలకు బలంగా గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు హుటాహుటిన రియాన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రియాన్ తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేజీబీవీల్లో నూతన మెనూ

- పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- పెరిగిన మెస్‌చార్జీలతో విద్యార్థినుల హర్షం


సోన్ కేజీబీవీ భవనం

లక్ష్మణచాంద: నిరుపేద బాలికలు మధ్యలో చదువు ఆపేయకుండా, వారిని అక్కున చేర్చుకుని కేజీబీవీలు వసతితో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. కేజీబీవీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. కేజీబీవీ విద్యార్థినులు పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నట్లు ఇటీవల చేపట్టిన సర్వేలో తేలింది. దీంతో కేజీబీవీ బాలికల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు పౌష్టికాహారం అందించి వారిని అనారోగ్య సమస్యల నుంచి దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉన్న మెనూలో పలు మార్పులు చేసింది. దీంతో 2025 -26 విద్యా సంవత్సరంలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించనున్నారు.

పెరిగిన మెస్ చార్జీలు

గతంలో 6 -10, ఇంటర్ విద్యార్థులందరికీ ఒకే విధంగా నెలకు రూ.1225లు ప్రభుత్వం అందించేది. కానీ నేడు నూతన మెనూ ప్రకారం 6 నుంచి 7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330లు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540లు, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.2100లు అందించనున్నారు.

నూతన మెనూ ఇదే..

ఉదయం.. టమాట కిచిడి, సాంబారు, బూస్టు, పూరి, రాగి జావ, ఉప్మా, పులిహోర, వడ, బోండా, చపాతి, జీరా రైస్‌తో పాటు రోజుకు ఒక్కో రకమైన పండ్లు అందించాలి. ఇందులో అరటి పండు, జామ, వాటర్ మిలన్, బొప్పాయి, సపోట వంటి పండ్లు అందించాలి.
మధ్యాహ్నం.. టమాట పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడక బెట్టిన గుడ్డు, చికెన్ అందించాలి.
సాయంత్రం.. ఉడకబెట్టిన శనగలు, కోడిగుడ్డు బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి.
రాత్రి వేళ.. వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ అందించాలి. నెలలో రెండు సార్లు మటన్, అయిదుసార్లు గుడ్లు, ప్రతీరోజు నెయ్యి అందించాలి.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల సమాచారం..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఇంటర్ కాలేజీలు	విద్యార్థుల సంఖ్య	మొత్తం
నిర్మల్	18	3600	14	2240	5840
మంచిర్యాల	18	3786	15	1080	4866
ఆదిలాబాద్	18	4800	13	680	5480
కుమురంభీం	15	3027	13	1069	4096

సంతోషంగా ఉంది



కేజీబీవీ బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. మెస్ చార్జీలు కూడా పెంచడంతో మాకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.
– ప్రసన్న, 10వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, లక్ష్మణచాంద

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గతానికి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మంచి పోషకాహారం అందడంతో చదువుపై మరింత దృష్టి సారిస్తాం.
– రిషిప్రియా, ఇంటర్, కేజీబీవీ, లక్ష్మణచాంద

నూతన మెనూ ప్రకారమే..



ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నూతన మెనూ అమలు చేయాలని కేజీబీవీల ఎస్‌వోలకు సూచించాం. కొత్త మెనూ పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నూతన మెనూ చార్టులు ఏర్పాటు చేయాలని సూచించాం.
– సలోమి కరుణ, సెక్టోరియల్ అధికారి, నిర్మల్

బస్సు ఢీకొని ఒకరి మృతి


ఘటనా స్థలంలో చంద్రశేఖర్ మృతదేహం


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ (49) అనే వ్యక్తి దేగాం గ్రామంలో బస్సు ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ -సుశీల దంపతులు బుధవారం బాసరకు వెళ్తున్నారు. దేగాం బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచిచూస్తున్న క్రమంలో చంద్రశేఖర్‌ను భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దేగాం చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..


సాయినాథ్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తానూర్ మండలం బెలతరోడకు చెందిన చెంచుల సాయినాథ్(37) బుధవారం బెల్‌తరోడ వెళ్లి బైక్‌పై భైంసా తిరిగి వస్తున్నాడు. సాత్‌పూల్ వంతెన వద్దకు చేరుకోగా, నిర్మల్ వైపు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎండీ గౌసుద్దీన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపినాథ్ తెలిపారు. సాయినాథ్‌కు భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇద్దరు వ్యక్తుల బైండోవర్


ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసిన పోలీసులు

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే ఇద్దరు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే వ్యక్తులు గత కొద్ది రోజుల నుంచి కారణం లేకుండానే 100 నంబర్‌కు డయల్ చేస్తున్నారు. పలుమార్లు ఈవిధంగా డయల్ చేస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఎలాంటి సమస్యలు లేకున్నా ఫోన్ చేస్తున్నందున బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన బిల్ల దేవక్క(59) అనే వృద్ధురాలు అనారోగ్యం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవక్క గత కొన్నేళ్లుగా బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అనారోగ్యం సమస్యలతో బాధపడుతుంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. దేవక్క కూతురు శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో దూకి యువకుడు..

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన బన్సోడే కరణ్(25) అనే యువకుడు గ్రామ సమీపంలోని కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై శంకర్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం... కరణ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిన పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. బుధవారం స్థానికులకు గ్రామ సమీపంలోని కుంటలో మృతదేహం కన్పించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

లక్సెట్టిపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దండెపల్లి, జన్నారం మండలాల నుంచి వచ్చిన 12 దరఖాస్తులను ఈసందర్భంగా స్వీకరించారు.

కూల్చివేతకు సిద్ధంగా కళాశాల భవనం


కొలతలు తీసుకుంటున్న ఇంజినీర్ అఖిలేష్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిథిలావస్థలో గల పురాతన భవనం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో చర్యలకు ఉపక్రమించారు. భవనం శిథిలావస్థకు చేరిందని కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఇంజినీర్ అఖిలేష్‌తో కలిసి బుధవారం కూల్చివేత అనుమతుల కోసం కొలతలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వేలాది మంది విద్యార్థులు చదువుకున్న భవనం కూల్చివేస్తున్న విషయం తెలియగా పలువురు కలత చెందుతున్నారు. ఈ భవనాన్ని 1969లో నిర్మించినట్లుగా తెలుస్తోంది.

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కొణతం దిలీప్

ఖానాపూర్: గతంలో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి కొణతం దిలీప్‌పై నమోదైన కేసులో భాగంగా బుధవారం ఆయన ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యారు. ఫిబ్రవరిలో నమోదైన కేసులో ఇది వరకే బెయిల్ మంజూరైనప్పటికీ ప్రతీ బుధవారం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈక్రమంలో పోలీసులు గంటల తరబడి ఆయన పోలీస్‌స్టేషన్‌లో నిరీక్షించేలా చేశారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీస్‌స్టేషన్ బయట పెద్దఎత్తున గుమిగూడారు.

బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారం


సంచరిస్తున్న ఎలుగుబంటి

కుభీర్: మండలంలోని బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారంతో సమీప ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం బెల్గాం గ్రామ శివారులోని చేనులో పని చేసే వారికి ఎలుగుబంటి కన్పించడంతో వారు భయంతో కేకలు వేయగా సమీప అడవిలోకి పారిపోయింది. మండలంలోని బ్రహేశ్వర్, మార్లగొండ అడవుల్లో ఎలుగుబంట్లు ఉన్నట్లు సమాచారం ఉంది. ఎలుగుబంటి కనిపించిందన్న వార్త వ్యాపించడంతో అడవుల సమీపంలోని గ్రామాల ప్రజలు అడవివైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ విషయమై అటవీ అధికారి లక్ష్మణ్‌ను బుధవారం వివరణ కోరగా ఐదు నుంచి ఆరు ఎలుగుబంట్లు ఉన్నాయని, అవి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లి మెడలో గొలుసు అపహరించిన కుమారుడు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: తల్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు దొంగిలించిన కుమారుడిని మందమర్రి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం మందమర్రి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు వైపు నివాసం ఉండే విజయపురి పుల్లమ్మ అనే వృద్ధురాలు గత నెల 24న అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టింది. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి పుల్లమ్మ మెడలో గొలుసు దొంగిలించినట్లు మనుమడు శివ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనలు, సాంకేతికత ఆధారంగా ఇంటి వారే దొంగతనం చేసి ఉంటారనే కోణంలో పుల్లమ్మ కుమారుడు శంకరయ్యపై నిఘా ఉంచారు. ఆయన అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో విచారించగా ఆర్థిక ఇబ్బందుల వల్ల తానే దొంగిలించినట్లు నేరం అంగీకరించాడు. ఈ మేరకు శంకరయ్య వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న ఎస్సై రాజశేఖర్, క్రైంటీం కానిస్టేబుళ్లు మహేశ్, రాకేశ్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

భీమారం: భీమారం ఎస్సై శ్వేత అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఆమెపై హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని, విచారణ లేకుండా కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరపాలని కమిషన్ రామగుండం సీపీకి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ విషయమై ఎస్సై శ్వేతను సంప్రదించగా.. రాజ్‌కుమార్ గ్రామంలో రౌడీయిజం, అక్రమ పనులు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో విచారణ చేస్తున్నామన్నారు. సహించలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

భూ వివాదంలో ఇరువర్గాల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ శివారులో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన పనాస గణేశ్ ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 64లో ఉన్న భూమిని మంగళవారం సాయంత్రం దున్నే క్రమంలో పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన సింగతి హైమావతి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి రాళ్లతో పరస్పర దాడులకు దిగారు. దాడిలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూకబ్జాకు యత్నం.. ఆరుగురి రిమాండ్

- నకిలీ పత్రాలతో మహిళకు బెదిరింపులు
- ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: భూ కబ్జాకు యత్నించిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ కె.ఫణిధర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనుకుంట గ్రామంలోని సర్వే నంబర్ 7/1లోని ఐదెకరాల 10 గుంటల భూమిని కళావతిబాయి 1979లో గడ్డం యాదవరావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసింది. 2020లో తన వదిన గైదాని లతా వామన్‌రావుకు విక్రయించింది. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు యత్నించారు. బినామీల సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి యాదవరావు వారసుల ద్వారా భూమిని కొనుగోలు చేసినట్లు సేల్ అగ్రిమెంట్ దస్తా వేజులు తయారు చేశారు. బాధితురాలిని స్థలం వదిలిపెట్టి వెళ్లాలని బెదిరించారు. దీంతో బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో 15 మంది ముఠా సభ్యులు ఉండగా, అందులో బుధవారం ఆరుగురు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ సాజిద్ అలియాస్ సాజిదొద్దీన్, శాంతినగర్‌కు చెందిన వకులాభరణం ఆదినాథ్, షేక్ వాహిద్, బృందావన్ కాలనీకి చెందిన చింతకుంట్ల సురేశ్, శివ్‌ఘాట్‌కు చెందిన సోంజోకి మోహన్‌లాల్, బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ యాహియాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా మహమ్మద్ ముజాహిద్, పత్తి ముజ్జు, షేక్ అబిద్ షేక్ నూర్, పార్వతీబాయి గడ్డంవర్, గడ్డం ప్రశాంత్, తనూజ నందకుమార్ దేశ్ పాండే, శోభ వినాయక్ కులకర్ణి, గడ్డంవర్ రామారావు, లలితా సుభాష్ లాంబే, దేశ్ పాండే సునీతలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. భూ కబ్జాలకు యత్నించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికోడే నరేశ్ అనే యువకుడికి అత్యాచారం కేసులో పదేళ్ల జైలుశిక్ష, రూ. 40 వేల జరిమానా జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ విధించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. గురుడుపేట గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ నరేశ్ వెంటపడ్డాడు. ఈ క్రమంలో 2017లో చింతలమానెపల్లి మండలానికి చెందిన ఒక వ్యక్తితో యువతికి వివాహం జరిగింది. యువతికి వివాహం జరిగినా నరేశ్ వేధింపుల కారణంగా యువతికి, ఆమె భర్తకు తరుచూ గొడవలు జరిగాయి. సెప్టెంబర్ 25, 2020న రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన యువతిపై నరేశ్ అత్యాచారం చేశాడు. పలుమార్లు పంచాయతీ నిర్వహించగా యువతికి భర్తతో విడాకులయ్యాయి. వేధింపులకు గురి చేయడంతో పాటు అత్యాచారం చేసిన నరేశ్‌పై యువతి ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. బుధవారం జిల్లాసెషన్స్ కోర్టులో సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నరేశ్‌కు జడ్జి జైలుశిక్ష ఖరారు చేశారు.

బౌలర్లదే జోరు


డి.లక్ష్మణ్


శ్రీరామ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 19 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తుండగా బుధవారం జరిగిన పోటీల్లో బౌలర్లదే హవా కొనసాగింది. రెడ్, బ్లూ జట్ల మధ్య 50 ఓవర్ల మ్యాచ్ జరగ్గా, బ్లూ జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 39.5 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెడ్ జట్టు బౌలర్లు అద్భుతంగా రాణించగా, డి.లక్ష్మణ్ 4 కీలక వికెట్లు సాధించాడు. అనంతరం లక్ష్య ఛేదనలో రెడ్‌జట్టు 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. శ్రీరామ్ 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడని కోచ్ ప్రదీప్ తెలిపారు.

ఎస్టీపీపీలో అధికారులను బదిలీ చేయాలి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గత పదేళ్లగా పాతుకుపోయిన సింగరేణి అధికారులను వెంటనే బదిలీ చేయాలని హెచ్‌ఎంఎస్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం నుంచి ఇప్పటి వరకు ఇంజినీర్‌గా వచ్చి డీజీఎం స్థాయి దాక ఎదిగినా ప్లాంట్‌లోనే కొందరు అధికారులు ఉన్నారని ఆరోపించారు. ప్రతీ ఏరియాలో బదిలీలు ఉంటాయని కానీ ఇక్కడ మాత్రం బదిలీ చేయకపోవడానికి ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

పీఎఫ్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి

నస్పూర్: ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ నిధి సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన సీఎంపీఎఫ్ జాయింట్ వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ బీభత్స, డీవైజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మందమర్రి డీవైపీఎం అసిఫ్, బెల్లంపల్లి సీనియర్ పీవో ప్రశాంత్, అధికారులు దేవేందర్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.